
"మీరు అయిదు రూపాయలు ఆయనకిచ్చేయండి. సరిపోతుంది" అని కండక్టర్ ఆమెతో అన్నప్పుడు చైతన్య చూశాడామెను.

పాతికేళ్ళుంటాయి. అందమైన ముఖం. కానీ ఏదో ఉదాసీనత... అప్పటికే ఆమె బస్సు దిగేసింది. తనూ వెనకాలే దిగాడు.

ఆమె చైతన్య వంక తిరిగి "తొంభయి అయిదివ్వండి.." అంది వంద నోటు ఇవ్వబోతూ.



# పూలచెట్టు

షేక్ రఫీ



''చిల్లర లేదండి'' అన్నాడు తటపటాయిస్తూ.

''మరెలా? విడి అయిదు రూపాయలు నా దగ్గరా లేవే?'' అందామె.

''పోనివ్వండి..'' అన్నాడు చైతన్య.

''మరి మీ అయిదు రూపాయలు...?''

''పోనివ్వండి...''

''ఎలా పోనివ్వమంటారు? అయిదు రూపాయలు వదులుకునే ఉదార మనస్తత్వం మీకున్నా మీ డబ్బులు తీసుకునే ఉద్దేశం నాకు లేదు'' అందామె.

''నా అడ్రసిస్తాను. మనీ ఆర్డర్ చెయ్యండి'' అన్నాడు.

''మరి ఎం.ఓ. చేరకపోతే?'' అడిగింది.


''ఏవండి.. మీ పేరేంటో తెలీదుగానీ...''

''సంధ్య..''

''సంధ్యగారూ... ఇంత చిన్న విషయానికి అంత టెన్షన్ పడటమెందుకు? మీరేమీ అనుకోకుండా నేను చెప్పిన ఓ పని చేస్తే మీరు నా అప్పు తీర్చేసినట్టే...'' అన్నాడు చైతన్య. ఏమిటన్నట్టు చూసిందామె.

''ఉదాసీనత మీ ముఖానికి నప్పదు. అలాగని చిరునవ్వు నవ్వమని అడగను. ప్రశాంతంగా వుండటానికి ప్రయత్నించండి'' అనేసి వడివడిగా అడుగులు వేస్తూ వెళ్లిపోయిన చైతన్య వైపు చూస్తూ ఉండిపోయింది సంధ్య.

***




## విలేకరులంటే లవ్

సినిమాలు దెబ్బతినేకొద్దీ హృతిక్ రోషన్‌కి మీడియాపై శ్రద్ధ పెరిగిపోతోంది. తరచూ ప్రెస్ మీట్‌లు ఏర్పాటు చేసి విలేకరుల యోగక్షేమాలు విచారిస్తున్నాడు. ఆప్యాయంగా విలేకరుల పర్సనల్ విషయాలు కూడా అడుగుతూ తన మొబైల్ నెంబర్ ఇచ్చి కష్టమొస్తే కాల్ చేయమంటున్నాడు

''ఏం చెయ్యాలనుకుంటున్నావ్? ఐ మీన్ ఏదయినా జాబ్?'' సంధ్య తల్లి చేతిలోంచి కాఫీ కప్పునందుకుంటూ సంధ్య నడిగింది స్నేహితురాలు అరుణ. కాసేపు ముగ్గురి మధ్య నిశ్శబ్దం...

''కొన్నాళ్లు విశ్రాంతి తీసుకోవాలనుకుంటున్నాను. నాకు మనశ్శాంతి కావాలి...'' అంది సంధ్య. రాత్రి రెండు గంటలగ్గానీ నిద్ర పట్టలేదామెకి. మానసిక స్థితికి ముఖం అద్దం పడుతుంది. నిన్న సాయంత్రం అతనెవరోగానీ నిజమే చెప్పాడు. తనకు ప్రశాంతత కావాలి. తన ముఖానికి ఉదాసీనత నప్పదా? మరి తనకు మిగిలింది అదేకదా!

''అమ్మాయికి ఇలా జరుగుతుందని అనుకోలేదు'' సంధ్య తల్లికి ఏడుపాగడం లేదు. కన్నీళ్ళు ఉబుకుతుండగా అరుణ వైపు నుంచి తల పక్కకు తిప్పుకుంది సంధ్య. ఆమె కళ్ళల్లో ఎరుపు జీరలు. ఉద్వేగం పట్టలేక ముక్కుపుటాలదురుతున్నాయి.

స్నేహితురాలి బేలతనాన్ని భరించలేక చప్పున లేచి చెమ్మగిల్లిన కళ్లతో సంధ్యని ఓదార్చ ప్రయత్నించింది అరుణ.

''తను చాలా సెన్సిటివ్ ఆంటీ... దేనికీ తట్టుకోలేదు. మీరే ధైర్యం చెప్పాలి'' అంది అరుణ. సంధ్య తల్లికి ఇంకా చాలా చెప్పాలనుకుంది అరుణ. ముక్కూ మొఖం తెలియని ఆ అమెరికా సంబంధమెందుకు చేశారు? అబ్బాయి డాక్టరయి డాలర్లు సంపాదిస్తే సరిపోతుందా? అసలతనెలాంటి వ్యక్తో పరస్పర అభిరుచులు, అభిప్రాయాలు సరిపోతాయో లేదో తెలుసుకోనక్కర్లేదా? ఇలా...

కానీ సంధ్య మాజీ భర్త డాక్టర్ శ్రీధర్ గురించి సమాజానికి కొంతవరకే తెలుసు.. అది అతను ప్రతిరోజూ సంధ్యని ఒళ్లు హూనమయ్యేలా కొడతాడని, మాటల్తో హింసిస్తాడని. శారీరక రుగ్మతలకు చికిత్స చెయ్యడంలో అక్కడి సమాజంలో ఎంతో పేరున్న అతనికి మానసిక చికిత్స చెయ్యవలసిన అవసరముందని ఎంతమందికి తెలుసు, సంధ్యకు తప్ప! భర్త అనబడే ఆ మృగం బారినుండి ఆమె ప్రాణాలతో బతికి బయటపడ్డమే ఓ అద్భుతం!

''నా ఉద్దేశ్యం ప్రకారం నువ్వు ఏదయినా జాబ్ చూసుకోవడం మంచిది. విశ్రాంతి తీసుకోవాలనే నీ ఆలోచన మంచిదే. కానీ చాపకింద నీరులా ప్రవేశించే భయంకరమైన ఒంటరితనం మాటేమిటి? అది గత జీవితం తాలూకు చేదు జ్ఞాపకాల్ని నీకు మరింతగా గుర్తుకు తెస్తూ నీ విశ్రాంతికి అనుక్షణం అంతరాయం కలుగజేస్తుంది... కాదా?'' అంది అరుణ. ఆమె చెప్పింతర్వాత గానీ సంధ్యకు ఈ విషయం స్ఫురించలేదు.

విశ్రాంతి పేరుతో తను ఫేస్ చేసే ఒంటరితనపు 'కాన్‌సీక్వెన్సెస్' గురించి తను ఆలోచించనే లేదు. కానీ ఏం చెయ్యాలి? ఇప్పటికిప్పుడు తనకు ఉద్యోగం ఎలా దొరుకుతుంది? తను ఎమ్మెస్సీ చదివింది. శ్రీధర్‌తో తన వివాహం జరగకముందు ఉద్యోగం చెయ్యాలని, స్వతంత్రంగా జీవించాలని ఎన్ని అనుకోలేదు? కానీ అవన్నీ తన పేరెంట్స్‌కు చెప్పగలిగిందా? లేదే? తన వ్యక్తిగత అభిప్రాయాలన్నీ తన మనసులోనే ఉంచుకుంది. బహుశా అదే తను చేసిన తప్పా? అందరు ఆడపిల్లల్లాగే తల్లిదండ్రుల మాటల్ని జవదాటకుండా తనూ తల వంచి శ్రీధర్‌తో తాళి కట్టించుకుంది. అసలు తనంత అదృష్టవంతురాలు ఈ భూమ్మీద మరొకరుండరని ఎంతమంది అనుకోలేదు పెళ్లిరోజు? నిజమే అనుకుని తనూ పొంగిపోయింది. తన అదృష్టానికి మురిసిపోయింది. కించిత్ గర్వపడింది. అంబరాన్ని తాకిన ఆ సంబరంలో సంధ్య తనని తాను మరచిపోయింది. వివాహం అంటే అసహ్యం కలిగేలా అనుక్షణం ప్రవర్తించాడు శ్రీధర్. పులినోట చిక్కిన లేడిపిల్లలా విలవిల్లాడిపోయింది సంధ్య.

* * *

''ఎవరికోసం ఇంత అందంగా తయారయ్యావ్?'' అడిగాడు శ్రీధర్ కేజువల్‌గా. ఆ ప్రశ్న ఎదుటి మనిషికి ఇబ్బంది కలిగిస్తుందేమోగానీ అతనికి మాత్రం కేజువల్‌గానే వుంటుంది. తమ పెళ్లయిన కొత్తల్లో ఓ సాయంత్రం జరిగిందిది.

''అదేమిటండీ అలా అంటారు? మీరుండగా ఎవరికోసమో తయారయ్యే అవసరం నాకేంటి?'' అంది తను.

''ఇప్పుడు నేను ఇంట్లో వున్నా కాబట్టి ఆ మాట అన్నావ్. నేను హాస్పిటల్‌కి వెళ్లినప్పుడు వేరెవర్తో అయినా కులకవని గేరంటీ ఏంటి?'' అన్నాడు.

కోపం నషాళానికెక్కి

''శ్రీధర్... స్టాప్ దట్ నాన్సెన్స్... ఏం మాట్లాడుతున్నావో ఎవరితో మాట్లాడుతున్నావో అర్థమవుతోందా?'' అంది.

అంతే! సంధ్య చెంపలు రెండూ ఛెళ్లుమన్నాయి. సంధ్య కళ్లలోంచి కన్నీళ్లు ఉబికి వచ్చాయి.

''నాకే ఎదురు చెప్తున్నావేంటే? ఎంత ధైర్యం నీకు? ఎవణ్ణి చూసుకుని ఆ ధైర్యం?'' అంటూ తన జుట్టు పట్టుకుని లాగి తన తల పగిలేలా గోడకేసి కొట్టాడు శ్రీధర్. బిక్కచచ్చిపోయిన సంధ్య దిక్కులు చూస్తూ అక్కడే కూలబడింది. చల్లటి రక్తం తలలోంచి ఆమె చెక్కిళ్లమీదుగా స్రవించసాగింది. అయినా శ్రీధర్ తృప్తిపడక ఫుట్‌బాల్‌ని కొట్టినట్టు కాళ్లతో ఎడాపెడా కొట్టాడామెని. ఆ తర్వాత తన నుదుటికి అంటిన చెమటని తుడుచుకుని ఇంటర్నెట్‌ని సర్ఫ్ చేస్తూ కూర్చున్నాడు శ్రీధర్. Bestiality అతనికెంతో ఇష్టం. అది చూడలేక జుగుప్సతో తల పక్కకి తిప్పుకుంది సంధ్య.

* * *

ఆరోజే ఆ కాలేజీలో జూనియర్ లెక్చరర్‌గా జాయినైంది సంధ్య. తలనొప్పిగా వుండి కాఫీ తాగుదామని కేంటిన్ వైపు వెళుతుంటే ''గుడ్ మార్నింగ్'' అన్న పిలుపు వినిపించి వెనక్కి తిరిగి చూసింది. అప్పుడు గుర్తొచ్చిందామెకు.

ఇతనిక్కడేమిటి? అయినా కర్టెసీ కోసమని ముఖమ్మీద నవ్వు పులుముకుందామని ప్రయత్నించింది. వీలుకాలేదు. నవ్వడం మాట అటుంచి కనీసం నవ్వుని పులుముకుందామన్నా చేతనవడం లేదు.

'some one has stolen the colours of my life' అనుకుంది.

''అయామ్ చైతన్య. ఇంగ్లీష్ లెక్చరర్‌గా పనిచేస్తున్నాను. మీరు ఈరోజే జాయినయ్యారని తెలిసింది. వెల్ కం టు అవర్ కాలేజ్..'' అన్నాడు. అతనిది నవ్వుముఖం.

అప్పటిగ్గాని కొద్దిగా వికసించలేదామె ముఖం.

వట్టి భోలామనిషిలా వున్నాడతను. గలగలా ఏవేవో మాట్లాడేస్తున్నాడు. మాట్లాడకుండా ఒక్క నిముషం కూడా ఉండలేడా?

"వట్టి కాఫీ తాగడమేంటండి? కేంటిన్లో మినపదోశె భలే రుచిగా వుంటుంది. దోశె తిని కాఫీ తాగితే మంచి కాంబినేషన్.... అసలు ఈ దోశెలు వేసే అతను ఎవరనుకున్నారు? గుంటూర్లో ఒకప్పుడు శంకర్ విలాసని ఫేమస్ హోటలుండేది... అది వీళ్లదే! ఏం చేస్తాం చెప్పండి! టైమండి... కీర్తి కరిగిపోయింది. రుచి మిగిలిపోయింది...'' అన్నాడు నవ్వుతూ. అతని మాటలు ఇవని తనూ నవ్వేసింది. ఎన్నాళ్లయింది తను నవ్వి. తను నవ్వుతుండగా కాసేపు అలాగే చూశాడతను.

"అదేంటలా చూస్తున్నారు?'' అడిగింది తను.

"మీకు నవ్వడం కూడా వచ్చా?'' అన్నాడు. మళ్లీ నవ్వింది సంధ్య. కానీ ఈసారి పెద్దగా నవ్వింది..

అతను తనవైపే అపురూపంగా చూస్తూ

"మీరెప్పుడూ ఇలా నవ్వుతూ వుండాలని కోరుకుంటున్నాను. పువ్వుల గురించి మనందరికీ తెలుసు. వాటిది చాలా పరిమితమైన జీవితకాలం. కానీ జీవించే ఆ కొద్ది ఘడియల్లోనే తమ పరిసరాల్ని పరిమళ భరితం చేస్తాయవి. కనీసం మనిషి నేడు ఓ పువ్వుని ఆదర్శంగా తీసుకున్నా సమాజంలో ఇన్ని వైషమ్యాలు వుండేవి కావేమో?'' అన్నాడతను.

'ఎంత అందంగా చెప్పాడితను. ఇతను మామూలు మనిషి కాదు. ఇతన్లో గొప్ప ఆత్మ సౌందర్యముంది' అనుకుంది సంధ్య.

కేంటిన్లో టిఫిన్ చేసింతర్వాత బిల్లు అతను పే చెయ్యబోతే వద్దని తనే పే చేసింది.

"మీరు నన్ను రుణగ్రస్తుణ్ణి చేస్తున్నారు'' అన్నాడు సిగ్గుపడుతూ

"అదేంకాదు. ఈవిధంగా మీ బాకీ తీర్చే అవకాశమిచ్చారు'' అంది సంధ్య.

"మీరు నాకు బాకీ పడ్డారా? ఏం బాకీ?'' అంటూ గుర్తు తెచ్చుకుని "ఓహో... అయిదు రూపాయలా?'' అని నవ్వేడతను.

"మీకో విషయం తెలుసా? మన ప్రభుత్వం చేసిన అప్పులకుగాను మనమంతా తలా ఓ యాభయి వేల రూపాయలు వరల్డ్ బ్యాంక్‌కి బాకీ వున్నామట..'' అన్నాడు చైతన్య.

"నిజమా'' అంటూ ఆశ్చర్యపోయింది తను.

"అవునండి. పూర్వపు రోజుల్లో అప్పు చెయ్యడమంటే నామోషీ. ఈరోజుల్లో స్టేటస్. మనకి పలుకుబడి వుండబట్టే కదా ఎదుటి వ్యక్తి మనకు అప్పు ఇచ్చింది అనే వితండవాదమొకటి...'' అన్నాడతను.

"మీ హాబీసేంటి? లిటరేచర్ చదువుతారా?'' అడిగాడు.

"ప్రకృతి ఆరాధన, సామాజిక పరిశీలన నా అభిరుచులు. ఇక లిటరేచరంటే అరుంధతీరాయ్ రాసిన 'గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్' చాలాసార్లు చదివాను'' అంది. తన జీవితానికి ఆ నవలకి కొంత సామీప్యత వుంది.

"డాల్రింపుల్ 'వైట్ మొగల్స్' చదివారా?'' అడిగాడు. లేదని చెప్పింది. తను చదివానని చెప్పి కొంత వివరించాడతను. చైతన్య మాటల్లో సమయం ఇట్టే గడిచిపోయింది. అతను మాట్లాడుతుంటే తను అతన్నే పరిశీలనగా చూసింది. అతనో ఎన్‌సైక్లోపీడియా. ఓ జీవధార... తను చదువుకునే రోజుల్లో ఇటువంటి వ్యక్తెప్పుడూ తటస్థపడలేదు తనకు.

"స్టూడెంట్స్ ఈరోజుల్లో ఎదుర్కొంటున్న పరిస్థితిని చూస్తుంటే జాలేస్తుందండి..'' అన్నాడతను. ఏమిటంది తను.

"ఓ సాహిత్యం తెలీదు. ఓ కళాభిరుచీ లేదు. ఓ ఆదర్శమూ లేదు. జీవన ఔన్నత్యమూ లేదు. ఎంతసేపూ ఆ మెడిసిన్ ఇంజనీరింగ్ కోర్సులకోసం అటు పేరెంట్స్, ఇటు ఫేకల్టీ చదువు నెపంతో ఆ పసిమొగ్గల్ని మానసికంగా నలిపేస్తున్నారు'' అన్నాడు.

"అవి సమాజంలో ఉన్నతమైన కెరీర్లు కదా?'' అంది.

"ఉన్నతమంటే?''

"ఐమీన్ సమాజంలో గౌరవప్రదమైన...''

"ఏంటండి గౌరవం? డాక్టరూ, ఇంజనీరూ అయితే నా గౌరవం, గుర్తింపు.. మిగతావి గౌరవప్రదమైనవి కావా? ఇంత చదివీ మనమూ అందరిలాగా మాట్లాడితే ఎలా? విద్య కాదండి గొప్పది. గుణం గొప్పది. ఆ సుగుణానికి విద్య తోడయితే అప్పుడది భాసిస్తుంది - పూవుకి తావి అబ్బినట్టు'' అన్నాడు. గతం గాయాన్ని మళ్ళీ కెలికినట్టయి బాధతో మూలిగింది సంధ్య హృదయం.

* * *

అవి అమెరికాలో తను భయంకరమైన జీవితాన్ని అనుభవించిన రోజులు. దుర్భరమైన ఒంటరితనం... అర్థేచ, కామేచ, మోక్షేచ నాతిచరామి అంటూ తనకు వాగ్దానం చేసి తనతో ఏడడుగులు నడిచిన తన భర్త శ్రీధర్ తనకు ప్రసాదించిన జైలు జీవితం.

తను ఉదయం హాస్పిటల్‌కు వెళ్లేటప్పుడు బయట్నుంచి లాక్ చేసుకుని వెళ్లిపోయేవాడు. తిరిగి రాత్రికి వచ్చేవాడు. మధ్యాహ్నం ఫోన్ చేసి మరీ "ఎవరితో కులుకుతున్నావ్?'' అనేవాడు. ఇక తను రాత్రికి ఇంటికొచ్చేడంటే సంధ్యకు నరకమే. తమ పెళ్లయి మూడు నెలలు కావస్తున్నా తమిద్దరి మధ్య సహజమైన దాంపత్య సంబంధాలేమీ లేవు. శ్రీధర్ చేతిలో దెబ్బలు తినీ తినీ తన శరీరమెప్పుడూ పచ్చిపుండులా వుండేది. తిరిగి అది సాధారణ స్థితికి చేరుకోకముందే మళ్లీ కొట్టేవాడు. తనకు చచ్చిపోవాలని

## జాజ్ జాణ

కొంచెం మిక్సూ కొంచెం రీమిక్సూ అన్నట్టు ఈ అమ్మడు ఆంగ్ల కోయిల అయినప్పటికీ భారతీయత కూడా కనిపిస్తూంటుంది. అందుక్కారణం సుప్రసిద్ధ సితార్ విద్వాంసుడు పండిట్ రవిశంకర్ కూతురు కావడమే. జాజ్ సంగీతంలో ఒరవడి సృష్టించి గ్రామీ పురస్కారాన్ని కూడా దక్కించుకున్న ఈ అందగత్తె పేరు నోరాజోన్స్. పాటలు పాడటమే కాదు అందచందాలనూ సొంతం చేసుకున్న పాతికేళ్ళ జాజ్ సుందరి ఓ ప్రదర్శనలో హొయలు పోయిన దృశ్యమిది. యువకులను తుళ్ళింతకు గురిచేసిన సమయమది.



## ఐశ్వర్య అండ్ ప్రిజుడీస్

ఐశ్వర్యారాయ్ కొండెక్కి కూచుంది. తనకు అంతర్జాతీయ మార్కెట్ ఏర్పాటుచేసిన గురిందర్ చద్దాకు గురువైపోయింది. వీళ్లిద్దరి కాంబినేషన్‌లో తయారవుతున్న బ్రైడ్ అండ్ ప్రిజుడీస్ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. గురిందర్ తన తదుపరి చిత్రానికి సంబంధించి కూడా పని ప్రారంభించింది. రెండో సినిమాకు కూడా ఐషూనే తీసుకుందామనుకుంది. కానీ, మన అందాల సుందరి తన పారితోషికం ఎంతో చెప్పేసరికి అంతలావు చద్దా దిగులుతో చిక్కి సగమైంది. ఐషూ తనకు అక్షరాలా ఐదు కోట్లు కావాలంది.



ఎన్నోసార్లు అనిపించింది. తన పేరెంట్స్ ఫోన్ చేసినప్పుడల్లా భోరున ఏడిచేది. వాళ్లేదయినా అడిగితే మళ్లీ కన్నీళ్లు తుడుచుకుని నవ్వు నటించి ''బాగానే వున్నాను'' అనేది. అప్పటికి తమ పెళ్లి జరిగి మూణ్ణెల్లు మాత్రమే అయింది. తమ వాళ్లు కట్నమయితేనేమి, ఇతరత్రా అయితేనేమి శ్రీధర్‌కు పాతిక లక్షల దాకా ముట్టజెప్పారు. అతనికి ఏ జన్మలోనో తాము బాకీపడి వుంటారు. లేకపోతే ఏంటి? అతను ఇంతవరకు తనతో ఓ మంచిమాట మాట్లాడితే ఒట్టు. కనీసం ఓ సహృదయ పలకరింపుకి కూడా తను నోచుకోలేదా? అంత తప్పు తనేం చేసింది? నిలువెల్లా విషంతో, మతిచెడి మనిషి రూపంలో వున్న ఓ నాగుపాముకిచ్చి తన పెళ్లి చేశారు తన వాళ్లు. తనెంతో సుఖపడుతుందని ఆశించారు. అమెరికాలో ఒక పెద్ద డాక్టరుకిచ్చి చేశామని పొంగిపోతున్న వాళ్లకు ఈ నిజాలెలా తెలుస్తాయి? తన జీవితం ఇలా తన వాళ్లకు దూరంగా పరాయి దేశంలో తెల్లారిపోవలసిందేనా?

"Bestiality గురించి నీ అభిప్రాయమేంటి?'' ఓ రాత్రి శ్రీధర్ అడిగాడామెని. అతని సమక్షమే కంపరం కలిగిస్తోందామెకి. అతనో జంతువు. తీక్షణంగా అతన్ని చూసిందో క్షణం. అతని పట్ల అంతులేని అసహ్యం వ్యక్తమైందా చూపుల్లో.

''జంతువులు వేరు, మనుషులు వేరు కదా?'' అంది. వంకరగా నవ్వేడతను. అతనో సైకో. అతని పర్వెర్షన్, పేషన్ bestiality. అతనీ addiction కు మూలాలేంటి? విశృంఖల స్వేచ్ఛా? అదుపు చేసే వాళ్లు లేకనా? 'టెన్ కమాండ్‌మెంట్స్'లో మోసెస్ ప్రవక్త మాటలు గుర్తొచ్చాయామెకి. "There will be no freedom without law" కనీసం తన అత్తమామలు తమ దగ్గరున్నా తన పరిస్థితి కొంత మెరుగ్గా వుండేదేమో? ఇలాంటి కొడుకుని కన్నందుకు వారికి మనసులోనే జోహార్లర్పించిందామె.

''నాకెందుకో అవి రెండూ కలిస్తేనే సంతోషం'' అన్నాడు.

''అది మీ బలహీనత. అందుబాటులో మీ భార్య వుండగా పట్టించుకోకుండా ఆ ఇంటర్నెట్లో ఏవేవో చూసి చెడిపోవడమెందుకు?'' అంది.

''నేను చెడిపోవడం లేదు. రిలీఫ్ పొందుతున్నాను'' అన్నాడు.

''ఆ చెత్త వీడియోలే మీకు రిలీఫ్ ఇస్తాయనుకుంటే నన్ను పెళ్లెందుకు చేసుకున్నట్టు?'' గట్టిగానే అడిగింది.

కనీసం మంచి మాటల ద్వారానైనా అతణ్ణి మంచి దారిలోకి తీసుకురావాలని ఆమె అంతరాల్లో ఓ చిన్న ఆశ. చెడు ఆలోచనలతో అతని మెదడు చెడిపోయిన మాట నిజమే! కానీ అతను తన భర్త కదా! కానీ శ్రీధర్ పట్ల తన మనసులో వున్న సాఫ్ట్‌కార్నర్ చెడిపోవడానికి ఎంతోసేపు పట్టలేదు. ఓ క్రికెట్ బ్యాట్‌ని తన చేతిలోకి తీసుకుని ''నాకే సలహాలిచ్చేంతగా ఎదిగిపోయావా? సలహాలిస్తావా సలహాలు..'' అంటూ తనని ఎడాపెడా గొడ్డుని బాదినట్టు బాదడం మొదలెట్టాడు. బాధని భరించలేక సంధ్య పెట్టే కేకలు ఆ నిశ్శబ్ద నిశీధిలో మార్మోగసాగాయి. ''అమ్మా...'' పొలికేక పెట్టింది సంధ్య.

***

దిగ్గున లేచి కూర్చుంది సంధ్య. ఉద్వేగంతో ఆమె గుండెలదురుతున్నాయి. నుదురు స్వేదంతో తడిసింది. గతమింకా పీడకలల రూపంలో ఆమెని వెంటాడుతూనే వుంది. భయపెడుతూనే వుంది. తాను శ్రీధర్ నుండి విడిపోయినా ఆ చేదు జ్ఞాపకాలు తనని విడిపోవడం లేదు. ఫలితం మళ్లీ ఇంకో నిద్రలేని రాత్రి. తలనొప్పి. డిప్రెషన్.

ఆ మర్నాటి ఉదయం...

తను మూడీగా వుండడం గమనించి ''అక్కా! ఎవరయినా సైక్రియాటిస్ట్‌ని కన్సల్ట్ అయితే?'' అంది చెల్లెలు రమ, కాఫీ కలిపి తన చేతికిస్తూ. డిగ్రీ ఫైనలియర్ చదువుతోందామె.

''దేనికి?''

''రాత్రి నువ్వు నిద్రలో అరిచావ్?''

''నిద్ర డిస్టర్బ్ అయిందా నీకు?'' అడిగింది.

''అవును''

సంధ్య కాఫీ తాగుతూ మౌనంగా వుండిపోయింది. చేదుగా వుండడం కాఫీ లక్షణమే అయినా ఆ పూటెందుకో వెగటుగా అనిపించింది. ఒకరాత్రి నిద్ర డిస్టర్బ్ అయినందుకే ఆమెకలా వుంటే తన బతుకే డిస్టర్బ్ అయింది. తనెవరికి చెప్పుకోవాలి? అయినవాళ్లే తన సమక్షాన్ని ఇబ్బంది ఫీలవుతుంటే ఇక తనకు దిక్కెవరు? వెంటనే ఆమెకు చైతన్య గుర్తొచ్చాడు. ఆమె ముఖం విప్పారింది. తన కష్టసుఖాలు చెప్పుకోవడానికి ప్రతి మనిషికి ఓ నేస్తం కావాలి. కొన్నే తప్ప అయిన వాళ్లతో అన్నీ చెప్పుకోలేం కదా! జరిగిన విషయాలన్నీ వున్నదున్నట్టు చెప్పుకోలేకపోయినా మనసెరిగిన మనిషంటూ ఓ తోడుండాలి. పరిచయమై కొన్నాళ్లే అయినా అతని సమక్షం తనకో నందనవనాన్ని గుర్తుకు తెస్తోంది. ఓ ముళ్ల చెట్టు వలన తనకయిన గాయాల్ని మాన్పే ఓ పూలచెట్టతను. ఆ నవ్వులు ఆహ్లాదభరితం. అతని మాటలు సంగీతం.

* * *

కాలేజ్ లైబ్రరీ మెట్లు అతనితో కలిసి దిగుతున్నప్పుడు...

''ఈరోజు నాకెంత సంతోషంగా వుందో తెలు

సా?'' అన్నాడు నవ్వుతూ.

''ఏంటి?''

''మీ ముఖంలో ఇదివరకెన్నడూ లేని ప్రశాంతత కనిపిస్తోంది''

''నా ప్రశాంతత మీకు సంతోషాన్ని కలిగిస్తుందా?'' అడిగింది.

''అది నా బలహీనత.. ఎదుటి వ్యక్తి సంతోషంగా వుంటే నాకు మరీమరీ చూడాలనిపిస్తుంది...''

మరుక్షణంలోనే ఆమె కళ్లు ఆర్ద్రమయ్యాయి. శ్రీధర్ గుర్తొచ్చాడు. ఎదుటి వ్యక్తి బాధపడితే అతనికి సంతోషం... ఇద్దరూ మగవాళ్లే... కానీ ఎంత తేడా అవగాహనలో? ఓ కొమ్మకు పూసిన గులాబి చైతన్య... అదే కొమ్మనుంచి పొడుచుకొచ్చిన ముల్లు శ్రీధర్. ఇతణ్ణి భర్తగా పొందే స్త్రీ ఎవరోగానీ ఆమె తప్పనిసరిగా పూర్వజన్మ సుకృతురాలయి వుంటుంది. అది ఎవరో ఎందుకు కావాలి? తనే ఎందుకవ్వగూడదు? కానీ తన గతమేంటో చైతన్యకు తెలీదు కదా? ఒకవేళ తెలిసినా అభ్యంతరాలు చెప్పే వ్యక్తి కాడతను. కానీ అతని marital status ఏంటో తనకు తెలీదు కదా? పెళ్లయిందో, అవ్వలేదో? అడిగితే ఎలా వుంటుంది? అంత తొందరెందుకు? తామిద్దరూ ఒకే కాలేజీలో పన్జేస్తున్నారు.

ఈలోగా ఇంతటి మంచి మనిషిని ఎవరేనా ఎగరేసుకుపోతే? అయినా తనకేమయిందీ రోజు? ఇంత possessive thinking ఎందుకని? తన మనసులోని విషయాలు తెలుసుకోగలిగే శక్తి చైతన్యకుంటే తనని ఎంతగా అసహ్యించుకుంటాడు? ఎందుకని అతనంటే తనింతగా ఇష్టపడుతోంది? ఇది బరితెగించడమా? కానేకాదు. ప్రేమ రాహిత్యం... దుర్భరమైన ప్రేమరాహిత్యమే దీనికి మూలం... గ్రీష్మ తాపానికి వాడిపోయి అలసిపోయింది తను. ఇప్పుడు తనని సేదదీర్చే చల్లని చిరుజల్లు కావాలి... చైతన్యే ఆ వానమబ్బయి తనని కమ్మివేయాలి. తన తోటని చిగురింపజెయ్యాలి.. ఎండిపోయిన తన జీవితంలో కొత్త మొలకలెత్తించాలి. నవ వసంతం రావాలి.

* * *

ఇల్లినాయిస్ సిటీలో డాక్టర్ రమేష్ వెనిగళ్ల ఇంటిముందు పోలీస్ కారు. డాక్టర్ శ్రీధర్ నైబర తను.

''డాక్టర్ శ్రీధర్ మీకెప్పట్నుంచి తెలుసు?'' రమేష్‌ని అడిగాడు పోలీస్ సార్జెంట్.

''అయిదు సంవత్సరాల నుంచి. మేమిద్దరం డాక్టర్లుగా ఒకేసారి జాయినయ్యాం... అతని మేరేజ్ కూడా ఇటీవలే అయింది...'' చెప్పాడు.

''శ్రీధర్ ఎలాంటి వ్యక్తి?'' తెల్ల పోలీస్ అడిగాడు.

''కావడానికి మేమిద్దరం పొరుగు వాళ్లమే అయినా మేం కలుసుకునేది హాస్పిటల్‌లోనే... అతన్తో నాకంతగా వ్యక్తిగతమైన పరిచయమేమీ లేదు. మనిషి చాలా రిజర్వ్‌డ్. ఎవర్తోనూ అంత ఎక్కువగా మాట్లాడడు. తన పనేంటో తను చేసుకు వెళ్లే మనిషతను. అతనో జెంటిల్‌మాన్ అని మేమంతా అతని గురించి అపోహపడ్డాం... ఎవరో స్త్రీ ఏడుపులు, పెడబొబ్బలు బిగ్గర ధ్వనితో రాత్రిళ్లు మాకు వినిపించేవి. ఏవో ఫ్యామిలీ గొడవలనుకున్నాం. కానీ తన భార్యని ఇంత క్రూరంగా హింసి

**పేరుకు తగినట్టు అతను నిజంగా చైతన్యే... ఇతనింత సరదాగా ఇంత సంతోషంగా ఎలా వుండగలుగుతున్నాడు? అసలితనికి బాధలే తెలీవా? ఏనాడూ కష్టపడి ఎరుగడా? తనకెదురైన కష్టాలు ఇతనికీ ఎదురయి వుంటే ఇలాగే నవ్వగలుగుతాడా? ఒడ్డున నిలబడ్డ వ్యక్తికి మునిగేవాణ్ణి చూస్తుంటే తమాషాగానే వుంటుంది.**

స్తున్నాడని 'కాపాడమంటూ' ఆమె రోడ్డుమీదకొచ్చే వరకు తెలీదు... ఇడియట్'' చెప్పాడు డాక్టర్ రమేష్ వెనిగళ్ళ.

అప్పటికే తలనుంచి రక్తస్రావమై స్పృహతప్పిన సంధ్యను హాస్పిటల్‌కు తరలించారు. చికిత్సానంతరం ఆమె తిరిగి శ్రీధరింటికి వెళ్లలేదు. శ్రీధర్ని అరెస్టు చేశారు. అతని ఉద్యోగం పోయింది. రమేష్ వెనిగళ్ల కుటుంబం ఆమెను ఎంతగానో ఆదరించింది. సాయపడింది. ఇండియా వచ్చినా ఆమె ప్రశాంతంగా వుండలేకపోయింది. సంధ్య తండ్రి కూతురి గురించి ఆలోచించి సిక్ అయ్యాడు. స్నేహితుల్లో అంటే పరవాలేదు. కాని చుట్టుపక్కల, ఆమె బంధువరాల్లో అదో పెద్ద చర్చనీయాంశమైంది. మూణ్ణెల్లకే పెళ్లి పెటాకులయిందని, సంధ్యకు చాలా పొగరని, ఈ కాలం పిల్లలింతేనని, ఇంతకన్నా మంచి సంబంధాలు ఎవరికి దొరుకుతాయని? చెల్లెలి పెళ్లి ఎలా జరుగుతుందని? ఇలా ఎన్నో? శ్రీధర్‌కి వీళ్లకీ పెద్ద తేడా కనిపించలేదు తనకు.

* * *

సాయంత్రం కాలేజ్ నుండి బయటికొస్తుండగా తనూ వెనకాలే వచ్చాడు. కొంతదూరం వచ్చాక వెనక్కితిరిగి చూస్తే కాస్త దూరంలో నించుండిపోయాడు. తను దగ్గరికెళ్లింది. అతని ముఖం ప్రశాంతంగా వుంది. కళ్లు రెండూ మూసుకుని గుండెల్నిండా గాలి పీల్చుకున్నాడు. ఏం చేస్తున్నాడితను? కొంపదీసి యోగా లాంటిది సాధన చేస్తున్నాడా? అదీ నడిరోడ్డులోనా? ఈ మనిషెంతకీ తన కర్థం కావడం లేదే? కళ్లు మెల్లిగా తెరిచి సంధ్యని చూసి నవ్వేడతను.

''ఏం చేస్తున్నారు?'' అడిగింది.

''అస్తమించబోతున్న సూర్యుడు, ఆకాశం, ఈ చెట్లు, చల్లని గాలి మీ ఆత్మని పలకరించడంలేదా?'' అడిగాడు. ఉలిక్కిపడిందామె.

అతను చెప్పాగ్గానీ ఆ విషయం స్ఫురించలేదు తనకు.

''అవునవును...'' అంది మాటల్ని నవ్వుని వెతుక్కుంటూ.

''ప్రేమ, సంతోషాలు ఎక్కడో లేవండి. అవి ఇతరులకు పంచగలిగే ఉద్దేశమే మనకుంటే తరగని నిధుల రూపంలో అవి మన గుండెల్నిండా నిక్షిప్తమై వున్నాయి'' చెప్పాడు చైతన్య.

అర్థం చేసుకోవడానికి ప్రయత్నించసాగిందామె.

''ఇప్పుడు నా మనసు ఆనందంతో పురివిప్పి నాట్యం చేస్తోంది తెలుసా?'' అన్నాడను.

''కాలేజ్‌లో ఈరోజేదయినా విశేషం జరిగిందా?'' అడిగిందామె కుతూహలంగా.

''సంధ్యగారూ, మీరేం మాట్లాడుతున్నారు? మనసుని ఆహ్లాదంగా వుంచుకోడానికి ఓ కారణం అవసరమా?'' అన్నాడు.

పేరుకు తగినట్టు అతను నిజంగా చైతన్యే... ఇతనింత సరదాగా ఇంత సంతోషంగా ఎలా వుండగలుగుతున్నాడు? అసలితనికి బాధలే తెలీవా? ఏనాడూ కష్టపడి ఎరుగడా? తనకెదురైన కష్టాలు ఇతనికీ ఎదురయి వుంటే ఇలాగే నవ్వగలుగుతాడా? ఒడ్డున నిలబడ్డ వ్యక్తికి మునిగేవాణ్ణి చూస్తుంటే తమాషాగానే వుంటుంది. ఇతనిది నిజమైన భావావేశమేనా? లేక ఒట్టి భావం లేని ఆవేశమా? ఇంద్రధనుస్సులోని ఏడు రంగుల్లా రోజుకో వాచకంతో దర్శనమిస్తున్నాడితను.

* * *

ఆరోజు ఉదయం అతని వ్యక్తిగత వివరాలడిగి, అతనికి పెళ్లి కాకుంటే ప్రపోజ్ చెయ్యాలనుకుందామె. ఓ స్త్రీగా తనకిది కొంత ఇబ్బందిని కలిగించే విషయమే అయినా తప్పదు. ఊహాగానాలకు తెరపడి అటోఇటో తేలిపోతుంది. కానీ చైతన్య కాలేజీకి రాలేదు. ఎంక్వయిరీ చేస్తే అతనికి జ్వరమొచ్చిందని తెలిసి బాధపడింది తను. బి.ఎ. ఫైనలియర్ స్టూడెంట్ ప్రతిమ తోడురాగా ప్రిన్సిపాల్‌తో హాఫ్‌డే పర్మిషనడిగి చైతన్యింటికి బయలుదేరిందామె.

ప్రతిమ కళ్లల్లో నీళ్లు చూసి బిత్తరపోయిందామె.

''చైతన్యసార్ చాలా మంచి మనిషి. మా ఇంట్లోనే అద్దెకుంటున్నారు'' అంది.

''అతని పేరెంట్స్?'' అడిగింది.

''ఎవరూ లేరు తనకి. తనో అనాథగా పెరిగారు...'' కన్నీళ్లు తుడుచుకోసాగిందామె. గుండెనెవరో పిండినట్టయిందామెకు.

''అయిదు సంవత్సరాల నుండి మా ఇంట్లోనే ఉంటున్నారు...''

ఇక చాలు. అయిదు వారాల్లోనే తననింతగా ప్రభావితం చెయ్యగలిగిన వ్యక్తి అయిదేళ్లుగా ప్రతిమ వాళ్ల ఇంట్లో వుంటున్నాడంటే వాళ్లెంతగా ప్రభావితమై వుంటారు!

చూడగా అతను జ్వరమొచ్చిన మనిషిలా లేడు. నవ్వు ముఖం ఎప్పట్లాగే.

''బాగున్నారా?'' తననడిగాడు. కానీ అది తను అడగాల్సిన ప్రశ్న కదా!

దిగులుగా వున్న ప్రతిమని చూసి ''ఉదాసీనత నీ ముఖానికి నప్పదు'' అన్నాడు చైతన్య. అప్పుడు తనతోనూ ఇదే మాటన్నాడతను. అంటే ఏమిటి?

''చైతన్యసార్ ఉన్నారని పూల చెట్టుని మేం పెంచుకోలేదు'' అంది ప్రతిమ చిరునవ్వుతో.

ఆమె చెప్పింది నిజమే!

చైతన్యని గుర్తించడంలో తనే అపోహపడింది.

అతనో పూలచెట్టు. ఆ దారిన వెళ్లే ప్రతివాళ్లూ ఆ పూలని కోయవచ్చు. ఆ పరిమళాన్ని ఆస్వాదించవచ్చు.

జీవన సౌందర్యాన్ని తెలియజేసిన ఆ చెట్టు తనకే సొంతం కావాలనుకుందేమిటి తను?